# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ

**పత్రికా ప్రకటన**

**మే 7, 2013**

## ఆదర్శ కమ్యూనిస్టు, మార్క్సిస్టు ఉపాధ్యాయిని, వీరవనిత

## కామ్రేడ్ గడ్డం లక్ష్మి (మహిత)కు దండకారణ్య జోహార్!

2013 ఏప్రిల్ 29న భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఒక విలువైన, సీనియర్ మహిళా నేతను కోల్పోయింది. గత 32 సంవత్సరాలుగా అలుపెరుగకుండా, వెనుదిరిగి చూడకుండా దేశ విముక్తి కోసం అంకితమై పని చేస్తున్న కామ్రేడ్ గడ్డం లక్ష్మి ప్రాణాంతక మలేరియా బారినపడి తుదిశ్వాస విడిచింది. ఆమెకు తగిన వైద్యం అందించి, బతికించుకోవడానికి తోటి కామ్రేడ్స్, నాయకత్వం చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. అలా అందరినీ శోకంలో ముంచెత్తుతూ ఆమె ప్రజల మధ్యనే కనుమూసింది. పార్టీ శ్రేణులలో 'మహిత'గా సుపరిచితురాలైన కామ్రేడ్ లక్ష్మి, చనిపోయే నాటికి పార్టీలో రాష్ట్ర స్థాయి నాయకత్వ కేడర్‌గా, సెంట్రల్ రీజియన్ మార్క్సిస్టు రాజకీయ పాఠశాలలో ఉపాధ్యాయినిగా దండకారణ్యం, ఉత్తర తెలంగాణా, ఆంధ్ర-ఒడిశా బార్డర్ జోన్ విప్లవోద్యమాలలో విలువైన సేవలందిస్తూ వుండింది. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ఆమెకు వినమ్రంగా తలవంచి విప్లవ జోహార్లర్పిస్తున్నది. ఆమె అందించిన ఉన్నత ఆదర్శాలను, అసంపూర్తిగా మిగిలిన ఆశయాలను తప్పక నెరవేరుస్తామని శపథం చేస్తున్నది. ఆమె మరణ వార్తతో శోకసంతప్తులైన కుటుంబసభ్యులకు, స్నేహితులకు, సన్నిహితులకు, సహచరులకు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలుపుతున్నది.

మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కేంద్రమైన నల్లగొండ జిల్లాలోని కోదాడ మండలం కందిబండ గ్రామంలో జన్మించిన కామ్రేడ్ లక్ష్మి విప్లవ ఖిల్లా అయిన వరంగల్ జిల్లాలో విద్యాభ్యాసం చేసింది. ఆనాటి ఆదర్శ విప్లవ నేతలైన పులి అంజన్న, గోపగాని అయిలయ్య వంటి గొప్ప కామ్రేడ్ల మార్గదర్శకత్వంలో ఆమె రాడికల్ విద్యార్థి సంఘంలో పని చేస్తూ పూర్తికాలం విప్లవకారిణిగా ఎదిగింది. ఆ క్రమంలో పలు మార్లు జైలు పాలయ్యింది. వ్యక్తిగత జీవితంలో కూడ అనేక ఒడిదుడుకుల్ని ఎదుర్కొన్నది. అనేక కష్టనష్టాల మధ్య, ఒక సీనియర్ కార్యకర్తగా సుదీర్ఘ కాలం పాటు తెలంగాణాలో, ఆంధ్రప్రదేశ్‌లో, ఆంధ్ర-ఒడిషా బార్డర్ జోన్‌లో పలు బాధ్యతలు నిర్వహించి ఎంతో అనుభవం గడించింది. విద్యార్థి ఉద్యమ కార్యకర్తగా మొదలై, అనేక టెక్నికల్, ఆర్గనైజేషనల్ పనుల నిర్వహణలో పాల్గొన్న కామ్రేడ్ మహిత పార్టీ అభివృద్ధి క్రమంలో తన వంతు పాత్ర పోషించింది. విప్లవం లేకుండా మహిళా విముక్తి లేదని, మహిళ లేని విప్లవం లేదని చెబుతూ ఆమె విప్లవోద్యమంలో మహిళా రంగం అభివృద్ధికై ప్రత్యేక కృషి చేసింది. పార్టీ రూపొందించిన మహిళా పర్‌స్పెక్టివ్‌ను కేడర్లకు బోధించడమే కాదు, దాన్ని సంపద్వంతం చేయడంలో కూడ ఆమె పాలు పంచుకుంది.

కామ్రేడ్ మహిత జీవితం 2008 చివరి నుండి దండకారణ్య విప్లవోద్యమంతో పెనవేసుకుపోయింది. పార్టీని సైద్ధాంతిక, రాజకీయ రంగాల్లో బలోపేతం చేయాలనే మహత్తర కర్తవ్య నిర్వహణలో భాగంగా ఆమె మార్క్సిస్టు పాఠాలు బోధించే ఉపాధ్యాయినిగా దండకారణ్యంలో అడుగుపెట్టింది. బాధ్యతల రీత్యా వివిధ రాష్ట్రాలలో పర్యటించినప్పటికీ ఆనాటి నుండి దండకారణ్యమే ఆమె ప్రధాన కార్యరంగంగా వుండింది. ఇక్కడికి వచ్చిన కొద్ది సమయంలోనే ఆదివాసీ ప్రజల స్థానిక భాషలను నేర్చుకొని ఇక్కడి కార్యకర్తలకు వాళ్ల భాషలోనే పాఠాలు బోధించేలా ఎదిగింది. సాధారణ పార్టీ సభ్యులకు, ఏరియా కమిటీ నుండి మొదలుకొని రాష్ట్ర స్థాయి కార్యకర్తల వరకు ఆమె అనేక మార్లు రాజకీయ తరగతుల్లో పాఠాలు చెప్పింది. రాజకీయ అర్థశాస్త్రం, పార్టీ చరిత్ర, భారత నూతన ప్రజాస్వామిక విప్లవం, మహిళా పర్‌స్పెక్టివ్ వంటి పలు సబ్జెక్టులను ఆమె సమర్థవంతంగా బోధించేది. ఎందరో కార్యకర్తలకు రాజకీయ, సైద్ధాంతిక శిక్షణను అందించడంలో పాలు పంచుకోవడం ద్వారా ఆమె దండకారణ్య విప్లవోద్యమ అభివృద్ధిలో తన వంతు పాత్ర పోషించింది.

బోధనా పనుల మధ్య దొరికే ఖాళీ సమయంలో కామ్రేడ్ మహిత దండకారణ్య విప్లవోద్యమాన్ని, ముఖ్యంగా ఇక్కడ కొనసాగుతున్న ప్రజా రాజ్యాధికారాన్ని దగ్గరగా పరిశీలించి, దాన్ని అధ్యయనం చేయడానికి, ఫీల్డు అనుభవాల నుండి నేర్చుకోవడానికి కృషి చేసింది. అభివృద్ధికరమైన అంశాలతో పాటు, తను గమనించిన లోపాలను, బలహీనతలను ఎప్పటికప్పుడు పార్టీ కమిటీల దృష్టికి తెస్తూ పార్టీనీ, ప్రజాసైన్యాన్నీ, వుద్యమాన్నీ బలోపేతం చేసుకోవడం కోసం విలువైన సూచనలు, సద్విమర్శలు చేసింది. అక్టోబర్ 2011లో జరిగిన దండకారణ్య స్పెషల్ జోన్ ప్లీనంలో పర్యవేక్షకురాలిగా హాజరై దండకారణ్య ఉద్యమాభివృద్ధి కోసం అమూల్యమైన సూచనలు చేసింది. దండకారణ్యం విముక్తి ప్రాంతంగా అభివృద్ధి కావాలని బలంగా ఆకాంక్షిస్తూ తన సందేశం వినిపించింది.

కామ్రేడ్ మహిత మంచి చదువరి. కఠినమైన గెరిల్లా జీవితంలో అరుదుగా దొరికే సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ తన బోధనా పటిమను, విషయ పరిజ్ఞానాన్ని, అవగాహనా పరిధిని పెంచుకోవడం కోసం బాగా కృషి చేసేది. అందరితో కలుపుగోలుగా వుంటూ, మృదువుగా మాట్లాడుతూ అందరి ఆదరాభిమానాల్ని చూరగొన్న ఉత్తమ కమ్యూనిస్టు ఆమె. బక్కపలుచగా, బలహీనంగా, అంతగా సహకరించని ఆరోగ్యంతో కుస్తీ పడుతూనే పార్టీ తనకప్పగించిన బాధ్యతలను నెరవేర్చడానికి గట్టి పట్టుదలతో కృషి చేసేదామె. ఈరోజు దోపిడీ పాలకవర్గాలు, వాళ్లకు సేవ చేసే పోలీసు/ఇంటలిజెన్స్ అధికారులు 'మావోయిస్టు నాయకులంతా అనారోగ్యంతో మంచాన పడుతున్నార'ని మీడియా ద్వారా కట్టుకథలల్లించి దుష్ప్రచారం చేయిస్తున్నారు. తద్వారా ప్రజలలో మావోయిస్టు ఉద్యమ భవిష్యత్తు పట్ల అనుమానాల్ని రేకెత్తింపజేసి, విప్లవ విజయంపై విశ్వాసాన్ని సడలింపజెయ్యాలని వాళ్ల ప్రయత్నం. కాని పెరుగుతున్న వయస్సును, వెంటాడే అనారోగ్యాన్ని లెక్కచేయకుండా నిత్యం ప్రజల మధ్య, ప్రజల రక్షణలో వుంటూ ఒంట్లో ఊపిరి వున్నంత వరకు ప్రజా శ్రేయస్సే పరమావధిగా పని చేసిన మహిత వంటి ధీరవనితల, వీరయోధుల ఆదర్శాలతో, ఆశయాలతో సాయుధమైన పార్టీ, ప్రజాశత్రువులు కంటున్న కలల్ని కల్లలుగా రుజువు చేసి తీరుతుంది. వాళ్లు సాగిస్తున్న మానసిక యుద్ధాన్ని విఫలం చేసి తీరుతుంది.

దేశ జనాభాలో 95 శాతంగా వున్న పీడిత ప్రజల కష్టాలకు, కన్నీళ్లకు కారణమైన దోపిడీ పాలకవర్గాలు ప్రజలపై కొనసాగిస్తున్న అన్యాయమైన యుద్ధం ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూలంగా నేడు విప్లవోద్యమ ప్రాంతాల్లో ప్రజలకు కనీస వైద్య సేవలు కూడ మరింతగా కరువయి పోయాయి. అందులో విప్లవ కార్యకర్తలకు సకాలంలో వైద్య సహాయం అందించడం కత్తి మీద సాము వంటిదే. పాలకవర్గాలు తమ దోపిడీ ప్రయోజనాలను కాపాడుకోవడం కోసం కొనసాగిస్తున్న ఫాసిస్టు దాడితో తలెత్తిన ఇటువంటి కఠిన పరిస్థితులే కామ్రేడ్ మహిత మృతికి దారితీశాయి. ఇప్పుడు మహిత మన మధ్య లేదు. కాని మహిత, మహిత వంటి వేలాది అమరులు అందించిన విప్లవాశయం కోసం అంకితమైన వేలాది కార్యకర్తలు, లక్షలాది ప్రజలు వున్నారు. భూస్వామ్యాన్ని, దళారీ నిరంకుశ పెట్టుబడిని, సామ్రాజ్యవాదాన్ని భూస్థాపితం చేసి భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడానికి, తదుపరి సోషలిజాన్ని, కమ్యూనిజాన్ని సాధించడానికి మరింత పట్టుదలతో పోరాడడమే వాళ్లకు మనం అందించే నివాళి. దండకారణ్య విప్లవోద్యమం కామ్రేడ్ మహిత సేవలను సదా గుర్తుంచుకుంటుంది. ఆమె కలలు గన్నట్టుగా విముక్తి ప్రాంత లక్ష్యాన్ని సాధించి తీరుతుంది. జోహార్ కామ్రేడ్ మహిత!

Gudsa Usendi

**(గుడ్సా ఉసెండి)**

**అధికార ప్రతినిధి,**

**దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**